విజయవంతంగా 'జగనన్నే మా భవిష్యత్..'

- కార్యక్రమలో భాగంగా రాష్ట్రంలో కోటి కుటుంబాలను నేరుగా కలిశాం
- వైఎస్సార్‌సీపీ నాయకులను ప్రజలు ఆదరిస్తున్నారు
- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



విజయనగరం:

ప్రజలకు మేలు చేసామన్న నమ్మకం... అదే ప్రజలు మమ్మల్ని ఆదరిస్తారనే ధైర్యంతో దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో చేపడుతున్న 'జగనన్నే మా భవిష్యత్ - మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం ప్రజా మద్దతుతో విజయవంతంగా సాగుతుందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. విజయనగరంలోని తన నివాసం వద్ద సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఈ నెల ఏడో తేదీ నుంచి రాష్ట్రంలోని సుమారు 15 వేల సచివాలయాల పరిధిలో చేపట్టి పీపుల్స్ మెగా సర్వేకు అనుహ్య స్పందన లభిస్తోందన్నారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం పేరిట ఏడు లక్షల మంది గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, ప్రజా ప్రతినిధులు ప్రజల వద్దకు నేరుగా వెళ్లి ప్రభుత్వ పాలనపై అభిప్రాయాలు తెలుసుకున్నారన్నారు. ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా కోటి కుటుంబాలను కలవగా... 79 లక్షల కుటుంబాలు ప్రభుత్వ పాలనకు మద్దతు తెలియజేయడం విశేషమని చెప్పారు. సంక్షేమ పథకాలు అవినీతి రహితంగా అందుతున్నాయని తెలిపారు. విజయనగరం నియోజకవర్గంలో 91,857 గడపలు ఉంటే.. ఇప్పటివరకు 71,407 ఇళ్లకు సర్వే చేశామని చెప్పారు. మరో ఐదు రోజుల వ్యవధిలో శతశాతం కుటుంబాలను కలిసి ప్రభుత్వ పనితీరుపై అభిప్రాయాలను తెలుసుకుంటామన్నారు.

అశోక్ రోడ్డెక్కితే ఎన్నికలు వస్తాయని సంకేతం..

మాజీ కేంద్రమంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు రోడ్డెక్కితే త్వరలో ఎన్నికలు వస్తాయని ప్రజలు భావించే పరిస్థితి నెలకొందని కోలగట్ల అన్నారు. ప్రతిపక్ష టీడీపీ నాయకులకు ఎన్నికలే ముఖ్యమన్నారు. వారు చేపడుతున్న కార్యక్రమాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాలనపై వ్యతిరేకతను కూడగట్టుకోలేక మీకు ఓట్లు ఉన్నాయా, లేదా అంటూ పరిశీలించడం దురదృష్టకరమని తెలిపారు. 2014–19 హయాంలో చంద్రబాబు చేసిన మోసాలను ఇప్పటికీ ప్రజలు మర్చిపోలేదని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైఎస్సార్‌సీపీ గెలుపు తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. చంద్రబాబు తన అనుకూల మీడియాతో ప్రభుత్వంపై దుష్ప్రచారాలు చేసినా సామాజిక మధ్యమాల ద్వారా వాటిని తిప్పికొట్టి వాస్తవాన్ని ప్రజలకు చేరవేస్తామన్నారు.

వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీదే విజయం



జగనన్నే మా భవిష్యత్ మెగా పీపుల్స్ సర్వే వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ, నియోజకవర్గ పరిశీలకుడు అందవరపు సూరిబాబు, తదితరులు

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు
- నియోజకవర్గ పరిశీలకుడు అందవరపు సూరిబాబు

భోగాపురం: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించి, రెండోసారి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సర్కార్ ఏర్పాటు చేయడం ఖాయమని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, నియోజకవర్గ పరిశీలకుడు అందవరపు సూరిబాబు అన్నారు. మండలంలోని సవరవిల్లిలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, సర్పంచ్ విజయభాస్కరరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్.. కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎన్నడూ లేనంతగా విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలను సీఎం జగనన్న అభివృద్ధి చేస్తున్నారన్నారు. ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలు అందిస్తూనే రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. అనంతరం ఉప్పాడపేట వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, 2024లో జరగనున్న ఎన్నికల ఫలితాలపై ఈ నెల ఏడో తేదీ నుంచి 15 వేల సచివాలయాల పరిధిలో మెగా పీపుల్స్ సర్వే చేపట్టగా.. తొలి 15 రోజుల్లో కోటి కుటుంబాలు పాల్గొనగా వారిలో 79 లక్షలకు పైగా కుటుంబాలు సీఎం జగన్ మోహన్‌రెడ్డి పాలనకు మద్దతు తెలియజేశారన్నారు. ఇందులో 25 ఎంపీ స్థానాలను వైఎస్సార్‌సీపీ దక్కించుకుంటుందని సర్వే ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ లెక్కన అసెంబ్లీ ఎన్నికల్లో 175 స్థానాలనూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు కైవసం చేసుకోడవం ఖాయమని జోష్యం చెప్పారు. వైఎస్సార్‌సీపీపై ప్రజలు చూపుతున్న సానుకూల ధోరణితో ప్రతిపక్ష పార్టీ నిద్రలేని రాత్రులు గడుపుతోందని ఏద్దేవా చేశారు. అనంతరం జగనన్నే మా భవిష్యత్ మెగా పీపుల్స్ సర్వే వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దంతులూరి రావాడబాబు, ఉప్పాడ శివారెడ్డి, నరసింహులు, బైరెడ్డి యర్రప్పలనారాయణ, పడాల శ్రీనివాసరావు, భాను, సుందర హరీష్, తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాల సంక్షేమమే జగనన్న లక్ష్యం



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజల సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. పూర్తి పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. నగరంలోని 44వ డివిజన్ అయ్యన్నపేటలో సోమవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొన్నారు. సోమవారం ఉదయం ఆ డివిజన్‌కు చేరుకున్న ఆయనకు స్థానికులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. పథకాల ద్వారా ఒక్కో కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరిందో వివరిస్తూ ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకుడు సైలాడ సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షుడు లెంక మహేష్ మాట్లాడుతూ.. ఓవైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమం అందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదర్శ పాలన అందిస్తున్నారన్నారు. అందుకే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల ముంగిటకు ధైర్యంగా వెళుతున్నామని చెప్పారు. ప్రజలు కూడా అదే రీతిన సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని చెప్పారు. లంచగొండితనం, మధ్యవర్తిత్వం లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు పథకాల నిధులు జమవుతున్నాయని తెలిపారు. తమ డివిజన్‌లోని ప్రజలకు అనేక ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని... దీంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ప్రభుత్వ పాలనతో పాటు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి తమ డివిజన్‌లో చేస్తున్న అభివృద్ధి ఎంతగానో ప్రజలకు ఉపయుక్తంగా ఉంటోందని చెప్పారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతీదేవి, అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, జోనల్ ఇన్‌చార్జ్‌లు దూబే, తమ్ము, తాళ్లపూడి పండు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు వినియోగించుకోవాలి

నెల్లిమర్ల రూరల్: ఉపాధి హామీ పనులను వేతనదారులు సద్వినియోగం చేసుకోవాలని టూరిజం బోర్డు రాష్ట్ర డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు సూచించారు. సీతారామునిపేటలో సోమవారం ఆయన పర్యటించి వేతనదారులతో మాట్లాడారు. కొలతల ప్రకారం పనులు చేస్తే వేతనం గిట్టుబాటు అవుతుందన్నారు.

అన్నదాన కార్యక్రమానికి వితరణ

నెల్లిమర్ల రూరల్: రామతీర్థం సీతారామస్వామి వారి దేవస్థానంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి గ్రామానికి చెందిన దాత తిరువేంగళమ్మ 50 కంచాలు, గ్లాసులను ఈఓ ప్రసాదరావుకు సోమవారం అందజేశారు. దేవస్థాన అభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఈఓ కొనియాడారు. కార్యక్రమంలో అర్చకులు నరసింహాచార్యులు, కిరణ్, రామగోపాల్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక అంశాలు వ్యాప్తి చేయడమే లక్ష్యం

విజయనగరం టౌన్: ఆధ్యాత్మిక అంశాలను విశ్వవ్యాప్తం చేయడమే తమ లక్ష్యమని ప్రబోధ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు వానపల్లి శంకరరావు అన్నారు. సోమవారం స్థానిక సమితి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రబోధసేవా సమితి, హిందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఒడిశాలోని కొరాపుట్ జిల్లాలో మే 3 నుంచి 15 వరకు త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం చేపట్టనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సభ్యులు ప్రసాద్, సూరిబాబు, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం



విజయనగరం రూరల్: సర్పంచ్‌లను సత్కరిస్తున్న ఎంపీపీ అప్పలనాయుడు, జెడ్పీటీసీ శ్రీనివాసరావు, తదితరులు



నెల్లిమర్ల : ఎంపీపీ సుధారాణిని సత్కరిస్తున్న సర్పంచ్‌లు, కార్యదర్శులు



డెంకాడ: గుణుపూరు,గుణుపూరుపేట సర్పంచ్‌లను సత్కరిస్తున్న ఎంపీపీ,సర్పంచ్‌లు,అధికారులు



పూసపాటిరేగ: ఉత్తమ పంచాయతీ సర్పంచ్‌లను సన్మానిస్తున్న ఎంపీపీ కల్యాణి, ఎంపీడీఓ రామారావు, తదితరులు

- ఎంపీపీ అప్పలనాయుడు

విజయనగరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నెలకొల్పిన గ్రామ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శమని ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీరాజ్ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని ముఖ్యమంత్రి జగనన్న సచివాలయ వ్యవస్థతో తీసుకువచ్చారన్నారు. అనంతరం మండల స్థాయిలో వివిధ విభాగాల్లో ఉత్తమ పంచాయతీలుగా ఎంపికైన జొన్నవలస, మలిచర్ల, సుంకరిపేట గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కెల్ల శ్రీనివాసరావు, ఎంపీడీఓ గంటా వెంకటరావు, ఈఓపీఆర్‌డీ డి.తిరుపతినాయుడు, మండల శాఖ అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండల శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ వ్యవస్థతోనే అభివృద్ధి ..

నెల్లిమర్ల: పంచాయతీరాజ్ వ్యవస్థతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ అంబళ్ల సుధారాణి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సుధారాణిని సర్పంచ్‌లు, కార్యదర్శులు సత్కరించారు. కార్యక్రమంలో సౌత్ సెంట్రల్ సలహా మండలి సభ్యుడు అంబళ్ల శ్రీరాములనాయుడు, ఈఓపీఆర్‌డీ హెచ్. భానోజీరావు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ వ్యవస్థ కీలకం...

పూసపాటిరేగ: గ్రామాల అభివృద్ధిలో పంచాయితీరాజ్ వ్యవస్థ కీలకమని ఎంపీపీ మహంతి కల్యాణి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ పంచాయతీరాజ్ వారోత్సవాల్లో భాగంగా ఉత్తమ సేవలు అందించిన పూసపాటిరేగ , పూసపాటిపాలెం, కుమిలి, లంకలపల్లిపాలెం సర్పంచ్‌లు టొంపల సీతారాం, రౌతు స్వామినాయుడు, మామిడి అప్పయ్యమ్మ, రౌతు వెంకటరత్నంలను సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.రామారావు, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, మండల ఇంజినీరింగ్ అధికారి శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్దనరావు, ఎస్. సత్యనారాయణరాజు, రౌతు సాయికుమార్ , గుజ్జు సురేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకు ప్రభుత్వ పాలన ..

డెంకాడ: గ్రామ స్వరాజ్యంతో ప్రజలకు ముంగిటకు పాలన తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు అన్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవంలో సర్పంచ్‌లను సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, ఎంపీడీఓ స్వరూపారాణి, ఈఓపీఆర్‌డీ అప్పలనాయుడు, ఏఓ పి.నిర్మల, సర్పంచ్‌లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

నగర పంచాయతీ, రెవెన్యూ సిబ్బందిపై ఫిర్యాదు

నెల్లిమర్ల: నెల్లిమర్ల నగర పంచాయతీ, రెవెన్యూ విభాగంలో పనిచేస్తున్న సిబ్బంది అక్రమాలకు పాల్పడుతున్నారని పట్టణానికి చెందిన పతివాడ రమేష్ సోమవారం గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదు చేశారు. నగర పంచాయతీ కార్యాలయంలో పనిచేస్తున్న కొంతమందితో పాటు రెవెన్యూ విభాగంలో పనిచేస్తున్న మరి కొందరు గతంలో ఇక్కడ పనిచేసిన కృష్ణమోహన్, జయదేవి అనే తహసీల్దార్ల పేరుమీద తప్పుడు ఇళ్ల స్థలాల పట్టాలు సృష్టించి, ఒక్కో పట్టాను రూ. 3 లక్షల చొప్పున అమ్ముకుంటున్నారని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. స్థానిక శ్రీరాంనగర్ కాలనీ, చంద్రబాబు కాలనీ, ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డు, గాంధీనగర్ కాలనీ, తదితర ప్రాంతాల్లో తప్పుడు పట్టాలు సృష్టించి విక్రయిస్తున్నట్లు ఆరోపించారు. అక్రమాలపై వెంటనే విచారణ చేపట్టాలని కోరారు. కలెక్టర్‌తో పాటు నెల్లిమర్ల నగర పంచాయతీ కమిషనర్, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్లు రమేష్ విలేకరులకు తెలిపారు.

సీఎండీని కలిసిన వైఎస్సార్ విద్యుత్ ఉద్యోగుల సంఘ నాయకులు



సీఎండీకి అభినందనలు తెలియజేస్తున్న ప్రసాదరావు, తదితరులు

విజయనగరం ఫోర్ట్: ఏపీఈపీడీసీఎల్ సీఎండీగా బాధ్యతలు స్వీకరించిన పృథ్వీతేజ్ ఇమందిని సోమవారం విశాఖపట్నంలోని సీఎండీ కార్యాలయంలో వైఎస్సార్ విద్యుత్ ఉద్యోగుల సంఘ నాయకులు కలిసారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం, మెమెంటో ఇచ్చి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ విద్యుత్ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీపై హెచ్ఎంలకు శిక్షణ



శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు

నెల్లిమర్ల: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించే సామాజిక తనిఖీలపై హెచ్ఎంలకు స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో సోమవారం శిక్షణ అందించారు. పాఠశాలలకు ప్రభుత్వం మంజూరు చేసే అన్నిరకాల నిధుల వినియోగంపై ఎంఈఓ అబుల్ల కృష్ణారావు ఆధ్వర్యంలో రిసోర్స్‌పర్సన్లు శిక్షణ అందజేశారు. ఆయా పాఠశాలలకు చెందిన పాఠశాల యాజమాన్య కమిటీలకు శిక్షణలోని అంశాలను తెలియజేయాలని ఎంఈఓ సూచించారు. కార్యక్రమంలో ఎమ్మార్సీ సిబ్బంది శ్రీనివాసరావు, భారతి, రేవతి, నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

'క్రాస్‌ప్రోగ్రాం'ను సద్వినియోగం చేసుకోండి..



క్రాస్‌ప్రోగ్రాం వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ కల్యాణి, తదితరులు

పూసపాటిరేగ: తాగునీటి వనరుల మరమ్మతులకు ప్రత్యేకంగా నిర్వహిస్తున్న క్రాస్‌ప్రోగ్రాం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మహంతి కల్యాణి కోరారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో క్రాస్‌ప్రోగ్రాం వాహనాన్ని ఎంపీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సుమారు 6 లక్షల రుపాయలతో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సుమారు 602 బోర్లు, 71 రక్షిత మంచినీటి పథకాల నిర్వహణ చేపడతామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామారావు, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్దనరావు, ఎస్.సత్యనారాయణరాజు, తదితరులు పాల్గొన్నారు.

జీరో టిల్లేజ్ విధానంతో అధిక దిగుబడి

డెంకాడ: జీరో టిల్లేజ్ విధానంలో మొక్కజొన్న సాగు చేయడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఈఓ బి. రామకోటి అన్నారు. మండలంలోని సింగవరం గ్రామ పరిధిలో మొక్కజొన్న పంటలో సోమవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 5/5 మీటర్ల విస్తీర్ణంలో పంటకోత ప్రయోగం చేపట్టగా... 30.240 కిలోల దిగుబడి వచ్చింది. ఈ సందర్భంగా ఏఈఓ రామకోటి మాట్లాడుతూ, జీరోటిల్లేజ్ మొక్కజొన్న సాగు చేయడం వల్ల ఎకరాకు సుమారు 8 క్వింటాళ్ల అధిక దిగుబడి వచ్చిందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం సీఏ పి.గురుమూర్తి, రైతులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్సీ పెనుమత్స రాక



డాక్టర్ సురేష్‌బాబు

నెల్లిమర్ల: ఎమ్మెల్సీగా రెండోసారి ఎన్నికైన డాక్టర్ పీవీవీ సూర్యనారాయణరాజు(సురేష్‌బాబు) ఆయన స్వగ్రామమైన మొయిద విజయరాంపురానికి మంగళవారం రానున్నారు. ఎమ్మెల్సీగా ఎన్నికైన ఆయన తాజాగా పదవీ ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే. ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత తొలిసారిగా ఆయన గ్రామానికి వస్తున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు విజయనగరం చేరుకుంటారు. అక్కడి నుంచి ఊరేగింపుగా 4 గంటలకు నెల్లిమర్ల పట్టణానికి విచ్చేస్తారు. స్థానిక మిమ్స్ జంక్షన్ వద్ద సురేష్‌బాబుకు ఘన స్వాగతం పలకడానికి అభిమానులు, పార్టీశ్రేణులు ఏర్పాట్లు చేస్తున్నారు. అక్కడి నుంచి నుంచి అధిక సంఖ్యలో బైక్‌లు, కార్లతో ర్యాలీగా ఊరేగింపు చేపట్టనున్నారు. రామతీర్థం జంక్షన్, మొయిద జంక్షన్, జరజాపుపేట, కొండగుంపాం జంక్షన్, పూతికపేట గ్రామం మీదుగా ఎమ్మెల్సీ సురేష్‌బాబు మొయిద విజయరాంపురం చేరుకుంటారు.

ఆదర్శ సచివాలయంగా తీర్చిదిద్దండి

- కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు



సచివాలయ కార్యదర్శులకు దిశా నిర్దేశం చేస్తున్న కమిషనర్ శ్రీరాములనాయుడు

విజయనగరం: మెరుగైన పౌరసేవలు అందించి ఆదర్శ సచివాలయాలుగా తీర్చిదిద్దే బాధ్యత కార్యదర్శులపై ఉందని నగర పాలక సంస్థ కమిషనర్ ఆర్. శ్రీరాములనాయుడు అన్నారు. నగరంలోని 26 నంబర్ సచివాలయంలో 22, 23, 24, 25, 26, 27 సచివాలయాల పరిధిలో ఉన్న కార్యదర్శులతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చి పౌర సేవలను మెరుగుపరచడం, మూమెంట్ రిజిస్టర్లను పక్కాగా నిర్వహించడం, విధుల పట్ల క్రమశిక్షణగా వ్యవహరించడం, తదితర అంశాలపై కార్యదర్శులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సచివాలయాలను ఏర్పాటు చేసిందన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం విడనాడాలని సూచించారు. సమావేశంలో సహాయ కమిషనర్ ప్రసాదరావు, ప్రజారోగ్య అధికారి సత్యనారాయణ, ఏసీపీ అమ్మాజీరావు, కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



పోలిపల్లి జెడ్పీ పాఠశాలలో పిన్నింటి కళావేదికను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

భోగాపురం: విద్యతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని పోలిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పిన్నింటి పాపునాయుడు, రత్నం దంపతుల జ్ఞాపకార్థం వారి కుటంబ సభ్యులు పిన్నింటి నరసింగరావు (చిన్న), సురేష్‌కుమార్, రవికుమార్, కిరణ్‌కుమార్ సుమారు రూ.3 లక్షల వ్యయంతో నిర్మించిన పిన్నింటి కళావేదికను ఏర్పాటు చేయగా, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పేదలు ఉన్నత విద్యను అభ్యసించేందుకు ప్రభుత్వం జగనన్న అమ్మఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యాదీవెన, వసతిదీవెన వంటి పథకాలను ప్రవేశపెడుతోందన్నారు. అటువంటి పథకాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు అందవరపు సూరిబాబు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, కర్రోతు బంగార్రాజు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణ మాస్టార్ జీవితం ఆదర్శం



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ దీపికా పాటిల్, తదితరులు

విజయనగరం క్రైమ్: నేటి యువతకు రామకృష్ణ మాస్టార్ జీవితం ఆదర్శమని ఎస్పీ దీపికా పాటిల్ అన్నారు. 175వ సారి రక్తదానానికి సిద్ధపడుతున్న బొడ్డేపల్లి రామకృష్ణ మాస్టర్‌కు జాయతీ రికార్డు రానుందన్నారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జాతీయ రికార్డ్ కార్యక్రమం మన జిల్లాలో జరగడం .. దానికి జిల్లాలో ఉండే అన్ని స్వచ్ఛంద సంస్థలు సహకరించడం శుభపరిణామమన్నారు. మే 1న జరిగే ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో బొడ్డేపల్లి రామకృష్ణ, మాతృభూమి సేవా సంఘం కార్యదర్శి ఇప్పలవలస గోపాలరావు, ఎస్‌వీఎస్ రక్తనిధి ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగేశ్వరావు పాల్గొన్నారు.

నడకతో ఆరోగ్యం

విజయనగరం: నడక ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తుందని, ప్రతిఒక్కరూ ప్రతిరోజూ కనీసం 30 నిమిషాలు నడవాలని ప్రముఖ ఎముకల వైద్య నిపుణుడు ఎ. శ్రీరామ్మూర్తి తెలిపారు. ఎస్‌వీఎన్ నగర్ వాకర్స్‌క్లబ్ 11వ వార్షికోత్సవం సందర్భంగా పట్టణంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, నడక వలన శరీరంలో ఎండార్ఫిన్లు అనబడే హార్మోన్లు విడుదల కాబడి ప్రతి ఒక్కరిలో ఒత్తిడి తగ్గుతుందన్నారు. మరో ముఖ్య అతిథి డాక్టర్ ఎ.శంకరరావు, క్లబ్ గౌరవ సలహాదారుడు ఆల్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ, క్లబ్ ద్వారా సేవా కార్యక్రమాలు చేపట్టడంపై ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం క్లబ్ ఆధ్వర్యంలో ప్రతినెలా నిర్వహిస్తున్న నగర సంకీర్తన కార్యక్రమాల్లో విశేష సేవలు అందించిన ముగ్గురు గాయకులు వరహాలరావు, చిరంజీవిరావు, నరేంద్రకుమార్‌లను సత్కరించారు. క్లబ్ అధ్యక్షుడు అల్లాడ శివరామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కార్యదర్శి కందుల సంతోష్ , కోశాధికారి గుంపిన నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.